

# శ్రీమతి సుజాత

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆఫీసునించి వొచ్చి టీ తాగేసరికి సుజాత బట్టలు మార్చుకుని వొచ్చి.

"పదండి - తాజ్‌లో మంచి పిక్చరు ఉందిట - చూసివొద్దాం," అంది.

"సారీ... మెహతా అర్జంటు పని మీద వొస్తున్నాడు - మళ్ళీ రాత్రి వెళ్ళిపోతాడు... అతనికోసం వెయిట్ చెయ్యాలి." అన్నాను.

"అవును... అతను శ్రీమతిని వొదిలి ఉండలేడు! మీరు నాతో ఉండలేరు!"

"అందులో చివరి సగం అసత్యం- మీకు తెల్సును."

"తెలుస్తూనే ఉంది ... నిజానికి అట్నుంచి ఇటు - ఆవిడమీద ఎంత అనుమానమో అతనికి!..."

"ప్రేమకొద్దీని!"

"ఏం ప్రేమ!... నాతో ఉండాలని ఉంటే మీరు సినీమాకి ఎందుకని రారు."

హఠాత్తుగా జ్ఞాపకం వొచ్చింది నాకు - నిన్న తాజ్‌లో 'జిందగి' చూద్దామని అనిపించి, సుజాతని రమ్మన్నాను ... రానన్నది.

'అది వొట్టి చెత్త పిక్చరు,' అంది సుజాత నిన్న.

"ఇవాళ పిక్చర్ మారిందా?" అన్నాను సందేహంగా.

"లేదే! జిందగే..."

"మరి నిన్న రమ్మంటే—"

ఎదురుగా సోఫాలో కూర్చుని నిదానంగా చూసింది ఆమె ... ఆ కళ్ళలో కొంచెం అల్లరి కనిపిస్తోంది.

"ఇవేళ ఓంప్రకాష్ కనిపించేడు సదర్‌లో - అతను చెప్పేడు — చాలా బాగుందని."

"విన్న నేనూ చెప్పేను –"

"అది వేరేమాట... మీరు ఊహిం చారు. అదీగాక – ఓమ్ బాగుందంటే నిజంగా..."

సిగరెట్ వెలిగించుకుని కళ్ళు మూసుకున్నాడు –

"బాధపడకండి... మీ మెహతా కోసం ఉండండి – మీరు సినిమాకి రానేవొద్దు."

"నువ్వు వెళ్ళు."

నిలబడి నవ్వుతోంది సుజాత –

"థాంక్స్... ఓంప్రకాష్‌ని రమ్మంటాను."

"నీ ఇష్టం."

ఆమె టెలిఫోన్ చేసింది ఓంప్రకాష్‌కి. నేను తీవ్రంగా ఆలోచిస్తున్నాను – ఈ అమ్మాయిని ఏనాటికైనా అర్థం చేసుకోగలనా అని.

రెండు మూడు నిమిషాల్లో ఎన్నో ఆలోచనలు వొచ్చాయి...

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"నిన్ను గురించి." ఆమె నిట్టూర్చి, కిటికీలో ముఖంపెట్టి బైటికి చూస్తోంది– పూల మొక్కల్లోకి.

"ఏమిటా విచారం?" అన్నాను నిలబడి, ఆమెని నావేపు తిప్పుకుని.

"మిమ్మల్ని ఎలాగ పెళ్ళి చేసుకున్నానా అని."

వొదులుగాఉన్న జైౖ విప్పి, నా చేతులు వొదిలించుకుని, లోపలికి వెళ్ళిపోయింది సుజాత.

విచిత్రమైన మనిషి!

ఆమె మనస్సులో ఏ ఆలోచనలు ఉన్నాయోనని ఆలోచిస్తూ కిటికీదగ్గర నిలబడ్డాను.

మరో ఐదునిమిషాల్లో ఓంప్రకాష్ వొచ్చాడు. ఆతన్ని కూర్చోబెట్టి మీదకి వెళ్ళాను, సుజాతతో చెప్పడానికి.

ఆమె అద్దంముందు కూర్చుని జైతో ఆడుకుంటూంది. నిలబడి ఒక్కసారి రెండుచేతుల్తోనూ నన్ను కౌగలించుకుంది.

నాకే ఆశ్చర్యంగా ఉంది.

మరుక్షణం క్రిందికి వెళ్ళిపోయింది సుజాత. ఓంప్రకాష్ కారు పెద్ద ధ్వనితో బయలుదేరి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన పదినిమిషాల్లో మెహతా ఇవేళ రాలేనని ఫోన్ చేశాడు. సినిమాకి వెడదా మనుకున్నాను. కాని వెళ్ళాలని అనిపించలేదు.

ఒక్కసారి ఆ ఏకాంతం ఏదో విచిత్రమైన భావనలు, చెప్పలేని బాధ కలుగజేసింది.

"మిమ్మల్ని ఎలాగ పెళ్ళి చేసుకున్నానా అని..." ఆ నిట్టూర్పు...

కుర్చీ బాల్కనీలోకి లాక్కుని కూర్చున్నాను. ఆ మాటే జ్ఞాపకం వస్తూంది... జరిగి ఆరునెలలై పోయినా, నిన్న జరిగినట్టు ఉంది.

* * *

నేను ఆగ్రా వొచ్చి అప్పటికి రెండు నెలలయింది. ఆరోజు మార్చి అనుకుం

టాను. సాయంత్రం మరీ ఒంటరిగా ఫీలయి షాజహాన్ గార్డెన్స్‌కి వెళ్ళాను. ఎక్కడా కూర్చోలేక తిరుగుతూంటే హటాత్తుగా విజయ కన్పించింది.

నేను ఆలోచించేలోపునే ఆమె నన్ను చూసి... "జగన్! ఇక్కడే ఉంటు న్నారా? ఎంత ఆశ్చర్యం?'' అంటూ వొచ్చింది.

అభివందనం చేసి, ఆమె పక్కన నిలబడ్డ అమ్మాయివొంక చూశాను. విజయ నవ్వి, పరిచయం చేసింది_సుజా తని. ఆమె ప్రతినమస్కరించి వెళ్ళి ఖాళీగా ఉన్న బెంచీమీద కూర్చుంది.

విజయ నాకు ఎంతో సన్నిహితురాలు. ఆమె భర్త అపుడు ఢిల్లీలో ఉండేవాడు_ ఆమె నాకు కలకత్తాలో బాగా తెల్సును_ మా పక్క ఫ్లాటు వాళ్ళది. నేను అక్క డికి వెళ్ళిన కొద్ది రోజుల్లోనే ఆమె నా స్నేహితురాలూ, సంరక్షకీ ఐపో యింది. అంతా రెండుసంవత్సరాల సెలవుమీద వొచ్చారిక్కడికి.

అన్నివార్తలూ చెప్పుకున్నాక, "తప్పకుండా రండి జగన్! ఆయన చాలా సంతోషిస్తారు, బేబీని మీరు చూడాలికూడా!" అని అడ్రస్ చెప్పి ఎంతో ఆప్యాయంగా మార్నాడు సాయం కాలానికి ఆహ్వానించింది విజయ.

''మీ స్నేహితురాలికి కోపం వచ్చిం దనుకుంటాను,'' అన్నాను దూరంగా కూర్చున్న సుజాతని చూసి.

"ఆమెకి మగవాళ్ళంటే కోపం?" అంది విజయ.

నవ్వేను.

చీకటిపడిపోయింది. అందరం కలిసి బయటికి బయలుదేరేం. వాళ్ళని పికప్ చేసేందుకు వాళ్ళ ఫ్రెండ్ రావాల్సిఉంది.

"నేను డ్రాప్ చేస్తాను పదండి," అన్నాను.

''మీరు ఎక్కడ ఉండడం?" అంది సుజాత_ఈ జీవితంలో ఆమె నాతో మొట్టమొదట అడిన మాటలు.

"ఈద్‌గాలో."

"దయాల్బాగ్ దాకా వొచ్చి మళ్ళా అంతదూరం వెళ్ళడం...''

''కష్టంలేదు_ రండి.''


సుజాత కారువెనక సీట్లో కూర్చుంది_ విజయ నా పక్కని కూర్చుని, "కారు ఎప్పుడు కొన్నావు?" అంది.

"నాలుగు నెల్లయింది...కాని ఫరవా లేదు...మిమ్మల్ని ఇంటిదాకా తీసికెళ్లే పూచీ నాది!" అన్నాను.

నవ్వి, "అందుకని అడుగలేదు_ మా కారు జ్ఞాపకం వొచ్చి... అది స్టార్ట యేసరికి నలుగురికి చెమట పట్టే లాగ కసరత్తు అవుతుంది. ఆ తరవాత ఫరవాలేదులెండి!" అంది విజయ.

నేనూ నవ్వేను.

ఆమె చెప్పినదానిలో హాస్యం ఏదో ఉందనికాదు. కారు ఉన్నవాడికి కారుని తోసితోసి స్టార్ట్ చెయ్యడంలో విషాదమే




డాక్టరు : మీరు తాగుడు మానెయ్యాల తక్షణం.
రోగి : నాకు తాగుడు అలవాటులేదండి.
డాక్టరు : అయితే సిగరెట్టు మానెయ్యండి.
రోగి : నేను సిగరెట్టు తాగనండి.
డాక్టరు : టీ, కాఫీ తాగుతారా ?
రోగి : తాగనండి.
డాక్టరు : మీరు అన్నిటికీ లేదులేదు అంటున్నారు. మీకు నేను వైద్యం చెయ్యలేను."

---

కాని, హాస్యం కనిపించదు. విజయ మాటలు విన్నాక సుజాత ఎంతో ఒంటరిగా వెనకాల కూర్చుని. 'వాళ్ళ కార్ లాగే ఆమె' అనిపించింది.

పోస్టాఫీస్‌దాకా ఒచ్చేసరికి, "సదర్‌కి వెళ్ళాలి; పళ్ళు కొనాలి. అటు వెళ్ళండి," అంది విజయ.

సదర్‌లో ఆపి, విజయతో వెళ్ళబోయాను.

"ఐదు నిమిషాల్లో వొచ్చేస్తాను; ఇక్కడే ఉండండి," అని, విజయ త్వరగా దిగి వెళ్ళిపోయింది.

నేను నా సీట్‌లోనే కూర్చుని సిగరెట్ వెలిగించబోయి, సుజాత జ్ఞాపకం

వచ్చి, దిగి బయటనిలబడి సిగరెట్ వెలిగించుకున్నాను. రెండుమూడు సార్లు సుజాతవైపు చూశాను. సగం కాంతిలో ఆమె బాగా కనిపించడం లేదు. కాని, ఎందుకో ఆమెమీద చాలా అభిమానం కలిగింది. ప్రత్యేకంగ ఏంకారణం ఉందని కాదు. ఆమె చూడటానికి బాగానే ఉన్నా, పెద్ద సౌందర్యవతి కాదు. కాని, ఆ కొంచెంసేపట్లో ఆమె అకారణంగానే సన్నాకర్షించింది. ఈ కొద్ది నిమిషాల్లో పొంగివచ్చే జీవనానందాన్ని ఆమె ఎందుకో హద్దుల్లో పెట్టుకుందనీ, ఈ మౌనమూర్తి ఆమె సహజస్వరూపము కాదనీ అనిపించింది.

"గులాబ్ సాబ్ !..."

చిన్న సజ్జలో అందంగా కట్టలు కట్టి రకరకాల గులాబీలూ, చేమంతులూ అమ్ముతున్నాడు చిన్నపిల్లాడు – బహుశా ఏ మాలి కొడుకో ఐఉంటాడు.

ఒద్దని తల ఊపేను.

వాడు పువ్వుల గుణగణాలని వర్ణించ సాగాడు – రెండు చేతులతోనూ ఎత్తి చూపుతూ తాజా...ఖుష్బూ...

నేను చలించలేదు.

ఆ గొడవలో సుజాత కారు దిగివచ్చి నా పక్కన నిలబడడం నేను గమనించ లేదు.

"పువ్వులు బాగున్నాయి. తీసుకో రేం ?" అంది చిరునవ్వుతో. ఆమె ఏదో గమ్మతు చేస్తూందని అనిపించింది, కళ్ళవెనుక ఏదో అల్లరి దాచుకున్నట్టు.

"మీరు తీసుకోండి," అన్నాను.

"ఏం చేసుకునేది ?... మీరు తీసు కొండి," అంది సుజాత.

"నేనుమాత్రం ఏం చేసుకునేది ?"

"ఎవరికైనా – మీ వాళ్ళకి – ఇవ్వొచ్చు !"

ఆమె కళ్ళల్లో అల్లరి, ఒకసవాల్... మెరుపులా నాకు కర్తవ్యం చూపెట్టేయి. త్వరగా రెండు గులాబుల గుత్తులూ, రెండు చేమంతుల కట్టలూ తీసుకుని, వాణ్ని పంపేశాను.

సుజాత తిరిగి వెళ్ళబోయింది.

"ఈ పువ్వులు... దయచేసి తీసి కెళ్ళండి," అన్నాను.

ఆశ్చర్యపోయి, "ఎందుకూ ?" అంది సుజాత.

నవ్వి, "మీ వాళ్ళ కిచ్చేందుకు !" అన్నాను.

"ఐతే – మీరే ఉంచుకోండి," అని, సుజాత వెళ్ళి కూర్చుని తలుపు వేసు కుంది. ఆమె ప్రవర్తన ఆ క్షణంలో నాకు పూర్తిగా అర్థంకాని విషయం నిజం.

ఇంతలో రెండుచేతుల్లోనూ పొట్లాలు పట్టుకుని విజయ వచ్చి కార్లో కూర్చుని "ఈ పువ్వు లేమిటి ?" అంది.

కారు స్టార్ట్ చేసే నెపంతో నే నేమీ అనలేదు. కొంచెం దూరం వెళ్ళేక విజయ మళ్ళీ అడిగింది.



సుజాత ముందుకి వొంగి, "ఆయన కొన్నారు... బహుశా బేబీకి ఇస్తారు!" అంది.

విజయ నావంక చూసి "ఔనా?" అంది.

"ఆఁ," అన్నాను.

"బేబీ కొత్త మగవాళ్ళనించి పువ్వులు పుచ్చుకోదు – మామ ఐనా సరే!" అంది విజయ.

"పసితనపు లక్షణం!" అన్నాను.

ఇంటికి చేరేసరికి ప్రసాద్ నన్ను కౌగలించుకుని, ఆశ్చర్యంగా కలుసుకున్న ఈ సంఘటనకి ఎంతో సంతోషించి, "పద. బేబీని చూడు!" అని లోపలికి తీసికెళ్ళేడు.

ఇంకా సంవత్సరం నిండలేదు బేబీకి. ఎంతో ముద్దుగా ఉంది. చేతుల్లోకి తీసు కునేసరికి గట్టిగా ఏడుపు ప్రారంభించింది.

ఆ క్షణంలోనే లోపలికి వొస్తూ, సుజాత, "పసితనపు లక్షణం!" అంది నవ్వుతూ.

తొందరగా అమ్మాయిని ప్రసాద్ చేతుల్లో పెట్టి డ్రాయింగ్ రూమ్‌లోకి వొచ్చేను. మరో నిముషంలో సుజాత పువ్వులు వేస్‌లో పెట్టి తెచ్చి టేబిల్ మీద పెట్టింది. ఆమె నా వైపు చూడనైనా చూడలేదు – ఆ రాత్రి పదకొండుకి నేను మళ్ళీ బయలుదేరేదాకా!

ఆ మరునాడు సాయంత్రం నేను వెళ్లే సరికి సుజాత ఢిల్లీ వెళ్ళిపోయిందని చెప్పింది విజయ. ''వాళ్ళ నాన్నగారికి జ్వరంగా ఉందిట : ఉదయం టెలిఫోన్ వొచ్చింది..." అంది పరీక్షగా చూస్తూ.

"అలాగే!... మేము తిరిగి వెళ్ళి పోయేలోపున ఆమె అడ్రసూ, టెలిఫోన్ నంబరూ తీసుకోండి," అంది విజయ.

"అంత పరిచయం మాకు లేదు లెండి." అన్నాను.

"నాకు తెలీదా తమ్ముడూ!... ఆ బేబీతో చెప్పండి," అంది విజయ.

ఆతరవాత చరిత్ర చాలా త్వరగా జరిగిపోయింది.

* * *

ఎనిమిది దాటింది... రోడ్డుకి అటు పక్కఉన్న ఎదురింటిలో రేడియో సినీ పాటలు వెలువరిస్తోంది. వీధిదీపాలు ఆరిపోతే బాగుండును!... ఈ నక్షత్రాలు ఎంతచక్కగా ఉన్నాయని!

* * *

ఆ రాత్రి ఇలాగే ఉంది... ఢిల్లీలో సుజాత ఇంట్లో బాల్కనీలో కూర్చు న్నాం, ఆమే, నేనూ, చెప్పలేని భావా లూను. రెండునెలలనించి ఆమెని కలుసు కొనేందుకు తహతహలాడినా, చివరకి వాళ్ళ నాన్నగారి కోరిక ప్రకారం ఢిల్లీ వెళ్ళి ఆమెని కలుసుకున్నాక, ఆ క్షణంలో ఏదో నెర్వస్‌నెస్...

"నాన్నగా రెక్కడ?" అన్నాను.

"ఆయనా, బ్రదరూ డిన్నర్‌కి వెళ్ళేరు... ఏం? రమ్మని టెలిఫోన్ చెయ్యనా?" అంది సుజాత.

"మీ ఇష్టం... ఆయన ఫోన్ చేశారు నాకు."

"అవును –''

"ఎందుకూ అని ఆలోచిస్తున్నాను.''

"నాకు తెలుసును – చెప్పేదా?"

"చెప్పండి."


"విజయ మీ వాళ్ళతో కలిసి ఆయ నకి ఒకఉద్దేశం కలిగించింది... బహుశా మీకు తెలీ దనుకుంటాను."

"చెప్పండి."

"మీకు పెళ్ళి చెయ్యాలని..."

"మరి?"

"అందుకని పిల్ల నిచ్చేముందు పరీక్ష కని నాన్నగారు మిమ్మల్ని పిలిచేరు."



నాకూ చాలా ధైర్యం వొచ్చి, "మరి ఆయన లేరేం, పరీక్షించడానికి?" అన్నాను.

"అమ్మాయి ముందర పాస్ చెయ్యాలి. ఆ తరవాత జాయింట్ పిటిషన్..."

జీవితంలోని చాలా ట్రాజెడీల్లో, మానవుడు తన జీవితంలోని మధురాతి మధుర క్షణాలని అవి గతించిన తరవాత కాని, అనుభవించలేకపోవడం ఒకటి.

ఆ క్షణాల మాధుర్యంకాక, వాటి

ప్రాముఖ్యత నన్ను లోబరుచుకుంది. ఆ సాయంత్రం, ఆలాగే, చల్లటిగాలి వస్తోంది. ఆరోజు నక్షత్రాలూ అలాగే, ఎంతో అందంగా బాధపెడుతున్నాయి — ఈ వీధిదీపంలాగే బాల్కనీలో ఒక్క దీపం వెక్కిరిస్తోంది.

'నా సహచారిణిగా ఈమె నన్ను సుఖపెడుతుందా? ఆమె సుఖపడుతుందా? అధునాతనంగా పెరిగిన ఈ అమ్మాయి కల లెలాగ ఉంటాయి? ఆ కలలమీద ఆమెకి ఎంతనమ్మిక ఉంది? నా చేతుల్లో ఆ స్వప్నాలమెట్లు ఎక్కుతుందా? సుజాత నన్నుగురించి ఏమనుకుంటుంది?' వెయ్యి ఆలోచనలు ముసురుకుంటున్నాయి మనస్సులో.

డ్రాయింగ్ రూమ్‌లో వొదిలేశాను సిగరెట్లు. ఈ క్షణంలో సిగరెట్ చాలా అవసరం. కాని, ఆ నిమిషాల అనిర్వచనీయ సౌందర్యాన్ని ఈ కదలికతో పాడుచెయ్యడానికి మనస్సు అంగీకరించలేదు.

హఠాత్తుగా సుజాత లేచి లోపలికి వెళ్ళి నా సిగరెట్ కేసూ, లైటరూ తెచ్చి యిచ్చింది. బాల్కనీలో దీపం ఆర్పి, ఎదురుగా కూర్చుని, "ఇప్పుడు బాగుందా?" అంది.

"చాలా బాగుంది..." అన్నాను ఆశ్చర్యంగా.

"ఈ చక్కటి సాయంత్రం .. మీకేమిటి జ్ఞాపకం తెస్తోంది?" అంది నెమ్మదిగా సుజాత.

ఆమెప్రశ్న నా కర్థంకాలేదు. నా ఆలోచనలని ఆమె గమనించి, చదివిన ఆశ్చర్యంలోనించి ఇంకా నేను తేరుకోలేదు.

"ప్రత్యేకం ఏమీలేదు," అన్నాను.

నిట్టూర్చి, "ఐతే మీకు మరుపైనా ఎక్కువ; లేకపోతే మీరు అబద్ధా లాడతారు!" అంది సుజాత.

"ఏమిటి మీ రనేది?"

"జ్ఞాపకం చేసేదా?... ఇలాటి రాత్రే... కలకత్తాలో, మీ ఫ్లాట్‌కే ఇలానే బాల్కనీ ఉండేది. అక్కడ మీరూ, సులేఖా,..."


'గాడ్!'

లేచి నిలబడ్డాను. అదంతా ఈమెకెలాగ తెలిసింది?...విజయ చెప్పిందా? ఆ ఉదంతం ఆమెకి తప్ప ఎవరికీ తెలీదు! సుజాత నిశ్చలంగా కూర్చుని నావంక చూసి చూసి, "నిజంగా చెప్పండి; ఏం జరిగింది?" అంది మృదువుగా.

"అదంతా విజయ చెప్పలేదా?"

"ఆమెకి తెలిసినదానికీ, మీరు చెప్పగలిగే నిజానికీ చాలా తేడా ఉంది .. చెప్పాలని ఉంటే చెప్పండి... బలవంతం చేస్తున్నా ననుకోకండి," అంది సుజాత చిన్నస్వరంతో.

మృదువైన ఆ మాటల అర్థం నాకు తెలుసును. సులేఖ ఈమెకీ నాకూ మధ్య నిలబడింది, ఎంతోకాలమైనా మనస్సులో




నించి వెళ్ళిపోయి. కాని, నిజంకోసం ఎంతో తహతహలాడేవాళ్ళే. దాన్ని మరీ భరించలేనివాళ్ళు.

కాని, నేను ఆమెని వంచించేందుకు ప్రయత్నం చెయ్యదలుచుకోలేదు; నన్ను నేను వంచించుకోకుండా నా ఆత్మాభిమానం రక్షించింది.

"ఆమె నాకు స్నేహితురాలు..."

"........."

"ఆ రోజు ఎందుకో ఆమె వొచ్చింది. ఇలాగే ఎంతో చక్కటి సాయంత్రం. నా ఫ్లాట్ లో ఎవ్వరూ లేరు – అనుకున్నాను."

"........."

"వివరాలన్నీ చెప్పే సహనం లేదు నాకు. కాని, మీరు నమ్మగలిగితే ఒక్కటి చెప్తాను. ఆ పరిసరాల పరిస్థితులకి కొంచెం లోబడ్డా, హద్దులు మీరలేదు – నేను..."

"...అంటే...?"

"బోధ పడుతుం దనుకుంటాను. సులేఖని నేను – ముద్దు పెట్టుకున్న మాట నిజమే. కాని, ఆ వెంటనే ఇద్దరమూ తెలివి తెచ్చుకున్నాము. మీతో ఎందుకు ఇదంతా చెప్పాలో తెలీదు నాకు... కాని, మీరు నమ్మగలిగితే, నిజం అదే."

చేతిలో సిగరెట్ నుసిఐపోయింది. బహుశా ఆమెతో నా భావి జీవితపు కలల్లాగ - అనుకున్నాను. మరొక సిగరెట్ వెలిగించుకున్నాను. పది, పన్నెండు నిమిషాలు మా మధ్య నిశ్శబ్దం - బహుశా సులేఖ తప్ప ఇంకేమీలేదు.

తరవాత సుజాత లేచి, "పదండి- భోజనం చేద్దాం," అంది.

"వొద్దు - నేను వెడతాను," అన్నాను.

లైటు వేసి నా కళ్ళల్లోకి పరీక్షగా చూస్తూ, "అలాగ కుదరదు. జాయింట్ పిటిషన్ పెట్టేముందు మీరూ నన్ను ప్రశ్న లడుగుతా రనుకుంటాను," అంది.

గుమ్మంలో నిలబడి ఎంతో అందంగా కనిపించింది ఆ క్షణంలో - ఆమెమాట లర్థమైన క్షణంలో - సుజాత.

"ఆ ప్రశ్న లిప్పుడే అడుగుతాను!" అన్నాను.

చేతులు కట్టుకుని, "అడగండి," అంది సుజాత.

"సులేఖతో నా కథ విన్నాక, మీరు ఎందుకు క్షమిస్తున్నారు?" అన్నాను.

"అది ప్రశ్నకాదు- ఆలోచన. మీరే చెప్పాలి... భోజనానికి వొస్తారా?" అంది సుజాత.

మరో రెండు నెలల్లో సుజాత మా ఇంటికి వచ్చేసింది. ఎన్ని మధుర క్షణాలు మా మధ్య దాచుకున్నా, నాకు ఆరోజు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వొస్తూనే ఉంటుంది: ఆమె మనస్సులో ఆక్షణాల్లో ఏం జరిగిందనే ప్రశ్న నన్ను వేధిస్తూనే ఉంటుంది. అది క్షమా? వైరాగ్యమా? నమ్మకా? ఏమిటి?

సుజాత రాక నేను గమనించనేలేదు- ఆమె వొచ్చి, "హల్లో!" అనేదాకా.

"సినిమా ఐపోయిందా?" అన్నాను.

"లేదు - ఇంకా ఉంది. నాకే చిరాకు పుట్టి వచ్చేశాను" అంది సుజాత.

"ఏం?"

ఎంతో దగ్గరగా కూర్చుని నావైపు తిరిగి, "నాకు నచ్చలేదు... హీరోని ఇంకో అమ్మాయి చేతుల్లో చూసి, వెళ్ళి అమ్మాయి గదిలో దుమికింది. ఆమె చావలేదనుకోండి. కాని నాకు నచ్చలేదు."

"........."

"కథ రాసినవాడు వొట్టి చవట... ఏ అమ్మాయికైనా ఎవ్వరికీ నచ్చనివాడు కావాలా?... మరొకళ్ళకి కావలిస్తే నే, అందం... జీవన మాధుర్యం... ఐనా, నేను ముందే చెప్పేను వొట్టి చెత్త అని. ఏమిటి ఆలోచిస్తున్నారు ఒంటరిగా కూర్చుని?"

"ఏమీ లేదు - నక్షత్రాలు బాగున్నాయి చూస్తున్నాను" అన్నాను.

బాల్కనీలో దీపం వేసి, "మనకి కనిపించని నక్షత్రాలు ఇంకా బాగుంటాయి పదండి. ఆకలిగా ఉంది." అని దారితీసింది సుజాత.

'అవే నక్షత్రాలు?' అని ఆలోచిస్తూ లోపలికి వెళ్ళేను.